చెత్త పాలన.. నయవంచన

సర్దుబాటు చార్జీలు, ట్రూ అప్ చార్జీల పేరుతో గతంలో కన్నా రెండు, మూడు రెట్లు అదనంగా కరెంటు చార్జీలు వసూలు చేస్తున్న కూటమి ప్రభుత్వంపై ప్రజలు కన్నెర్ర చేశారు. కరెంటు బాదుడుపై వైఎస్సార్ సీపీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం తిరువూరు, మైలవరం, నూజివీడు నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహించిన ర్యాలీలు, ధర్నా కార్యక్రమాల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నమ్మిన ప్రజలను నయవంచన చేసిన చంద్రబాబుకు గుణపాఠం తప్పదంటూ హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్



కరెంటు చార్జీలను తగ్గించాలంటూ మైలవరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేసిన అనంతరం ఏఈ రమేష్‌కు వినతిపత్రం ఇస్తున్న జోగి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు

జి.కొండూరు: సూపర్ సిక్స్ హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పరిపాలన ఆరు నెలల్లోనే చెత్త పరిపాలన అని తేలిపోయిందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. కరెంటు చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా జోగి రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ శ్రేణులు మైలవరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. జోగి రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపుతో రూ.15,495 కోట్లను ప్రజల నుంచి అక్రమంగా వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు పాలన రాక్షస పాలనను గుర్తు చేస్తోందన్నారు. విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై అదనపు భారాన్ని మోపారన్నారు. చంద్రబాబు ప్రజలపై చేసే కుట్రలను తిప్పికొట్టేందుకు తామెప్పుడూ ప్రజల పక్షాన నిలబడతామని అన్నారు. అనంతరం విద్యుత్ చార్జీలను తగ్గించాలని కోరుతూ స్థానిక విద్యుత్ శాఖ ఏఈ రమేష్‌కు జోగి రమేష్, పార్టీ శ్రేణులు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు వేములకొండ తిరుపతిరావు, అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు పామర్తి శ్రీనివాసరావు, జి.కొండూరు, విజయవాడ రూరల్ ఎంపీపీలు వేముల కొండ లక్ష్మీతిరుపతమ్మ, చెన్ను ప్రసన్నకుమారి, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం జెడ్పీటీసీ సభ్యులు మందా జక్రధరరావు, గరికపాటి శ్రీదేవి, కొండపల్లి మున్సిపల్ వార్డు కౌన్సిలర్ జోగి రాము, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి, కేడీసీసీబీ మాజీ వైస్ చైర్మెన్ వేములకొండ రాంబాబు, పార్టీ జిల్లా కార్యదర్శి పచ్చిగోళ్ల పండు, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వాహేద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల జేబులకు చిల్లు



చంద్రబాబు సంపద సృష్టించి పథకాలు అమలు చేస్తానంటే ప్రజలు నమ్మి ఓట్లు వేశారని, కానీ ఓట్లు వేసిన ప్రజల జేబులకే చిల్లుపెడతారని ఊహించలేదు. ప్రజలను దోచుకోవడంలో చంద్రబాబు లాంటి ఘనుడే మరెవరూ ఉండరు. కూలి చేసుకుని బతికే పేదవారికి కూడా రూ.వెయ్యికి పైగా కరెంటు బిల్లులు వస్తున్నాయంటే చంద్రబాబు బాదుడు ఏ విధంగా ఉందో అర్థమవుతుంది.

–అప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, మైలవరం

సర్దుబాదుడు భరించలేం



2022లో వినియోగించుకున్న విద్యుత్‌పై సర్దుబాటు చార్జీల పేరుతో అదనంగా వసూలు చేయడం దుర్మార్గం. ప్రజలను పట్టి పీడించే ప్రభుత్వం మాత్రం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యమేలుతోంది. సంపద సృష్టిస్తానని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు ప్రజల జేబులకు చిల్లులు పెట్టి సంపద సృష్టిస్తున్నారు.

–వేములకొండ తిరుపతిరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, జి.కొండూరు

షాక్ కొడుతున్న కరెంటు చార్జీలు



నూజివీడులో మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నేతృత్వంలో ర్యాలీగా వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: కూటమి ప్రభుత్వ పాలనలో కరెంటు చార్జీలు ప్రజలకు షాక్ కొడుతున్నాయని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. విద్యుత్ చార్జీల పెంపుపై ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరుబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన నూజివీడులో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి హనుమాన్ జంక్షన్ రోడ్డులోని ఏపీసీపీడీసీఎల్ ఈఈ కార్యాలయం వరకు మేకా ప్రతాప్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీగా తరలివెళ్లారు. అనంతరం అక్కడ ధర్నా నిర్వహించి విద్యుత్ శాఖ ఈఈ ఎ.సత్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ఒక్క రూపాయి కూడా కరెంటు బిల్లు పెంచమని, పైగా తగ్గిస్తామని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు ప్రజలపై మోయలేనంత భారం వేస్తున్నారన్నారు. తల్లికి వందనం, ఆడ బిడ్డకు నిధి ఎప్పుడు అమలు చేస్తారని, మహిళలకు ఉచిత ప్రయాణం ఏదని, ప్రతి రైతుకు ఏటా రూ.20వేల ఆర్థిక సాయం అందించేది ఎప్పుడని నిలదీశారు. ప్రజా వ్యతిరేక పాలన చేస్తున్న కూటమి ప్రభుత్వంపై ప్రజల పక్షాన ఉండి నిరంతరం పోరాటం చేస్తూనే ఉంటామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీలు వరికూటి ప్రతాప్, చెలికాని అనూష, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, ముస్లిం మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీ జిల్లా అధ్యక్షుడు షేక్ యూనిస్ పాషా (గబ్బర్), పిల్లా చరణ్, వైఎస్సార్ సీపీ నాయకులు పగడాల సత్యనారాయణ, ఆరేపల్లి రాంబాబు, అక్కినేని ప్రేమ్‌సాయి, పాలడుగు నాని, కవులూరి యోగేశ్వరరావు, మందాడ శివశంకర్‌రావు, పలగాని నరసింహారావు, గోళ్ల అశోక్, పలువురు కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజలపై పెనుభారం



తిరువూరు మండలం లక్ష్మీపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ధర్నా చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

తిరువూరు: ఎన్నికల సమయంలో అలవి కాని హామీలు గుప్పించి ఓటర్లను ప్రలోభాలకు గురిచేసిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు విస్మరించి ప్రజలను నయవంచన చేశారని తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ కన్వీనర్ రేగళ్ల మోహనరెడ్డి విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపుతో పేదలపై పెనుభారం మోపిందని ఆరోపిస్తూ శుక్రవారం తిరువూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. తిరువూరు శాంతినగర్ నుంచి లక్ష్మీపురంలో ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి అనంతరం అక్కడ ధర్నా నిర్వహించారు. సంక్షేమ పథకాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కంటే మూడురెట్లు ఎక్కువ అమలు చేస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి నేతలు సూపర్ సిక్స్ పథకాలను గాలికి వదిలేశారని మోహనరెడ్డి ఆరోపించారు. తిరువూరు పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ మాట్లాడుతూ పాలనలో పూర్తిగా విఫలమైన కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదు చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. ఇకనైనా ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలు చేయడంతో పాటు పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యుత్ డీఈ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్‌పర్సన్ వెంకటేశ్వరి, వార్డు కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్, పసుపులేటి శేఖర్‌బాబు, మాదు దుర్గా, ఏరువ ప్రకాష్‌రెడ్డి, ఇనపనూరి చిన్నారి, కొలికపోగు నిర్మల, ఎ.కొండూరు, విస్సన్నపేట, గంపలగూడెం జెడ్పీటీసీ సభ్యులు భూక్యా గన్యా, లోకేశ్వరరెడ్డి, శామ్యూల్, కంభంపాడు, కోడూరు, ఆంజనేయపురం గ్రామాల సర్పంచులు కోట పుల్లారావు, సురేష్, కుటుంబరావు, గంపలగూడెం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు నరెడ్ల వీరారెడ్డి, శిరసాని ప్రకాష్, ఓలేటి దుర్గారావు, గద్దల మల్లయ్య, జయకర్, ముంగా జయరాజ్, గజ్జల సీతారామయ్య, కాలసాని గోపాల నాగేశ్వరరావు, తాళ్ళూరి నవీన్, మందపాటి ఉమామహేశ్వరరెడ్డి, గుత్తికొండ భాస్కరరెడ్డి, కొరివి వినయ్‌కుమార్, నెహ్రూ, జాకీర్, ఆలపాటి ఉమామహేశ్వరరావు, గత్తం నాగేశ్వరరావు, చెరుకు నరసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకం సద్వినియోగం చేసుకోండి

జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పిలుపు



రిటైర్డ్ ఇంజినీర్ ప్రసాద్ ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్యానల్ బోర్డులు పరిశీలిస్తున్న కలెక్టర్

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ పిలుపు ఇచ్చారు. మండలంలోని గుంటుపల్లిలో పీఎం సూర్యఘర్ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న రిటైర్డ్ ఇంజినీర్ ఏఆర్ఎస్‌పీ ప్రసాద్ ఇంటిని శుక్రవారం ఆయన సందర్శించారు. అధికారులతో కలిసి సూర్యఘర్ పథకం ద్వారా ఏర్పాటు చేసుకున్న సౌర విద్యుత్ వ్యవస్థను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణం, ఆరోగ్యకర జీవితానికి మేలు చేసే పునరుత్పాదక ఇంధన వినియోగం దిశగా ప్రతిఒక్కరూ అడుగులు వేయాలన్నారు. రిటైర్డ్ ఇంజినీర్ ప్రసాద్ ఇంటికి గతంలో దాదాపు రూ.3 వేలు కరెంటు బిల్లు వచ్చేదని, ఇప్పుడు జీరో బిల్లు వస్తోందని తెలిపారు. మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇవ్వడంతో 325 రూపాయలు ప్రభుత్వమే ఆయనకు ఇస్తోందన్నారు. రూ.2 లక్షల విలువైన 3 కేడబ్ల్యూ సోలార్ ప్యానెల్ రూ.78 వేల రాయితీతో ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. రూ.20 వేలు లబ్ధిదారు వాటా పోను మిగిలిన మొత్తం తక్కువ వడ్డీతో బ్యాంకు రుణంగా పొందొచ్చని వివరించారు.

చెత్త సంపద తయారీ కేంద్రం పరిశీలన

స్థానిక చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని కలెక్టర్ లక్ష్మీశ పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్ర కార్యకలాపాలను విజయవంతంగా నిర్వహించాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ ఎ.మురళీమోహన్, డీఈఈ కొండలరావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని మన్‌మోహన్ సింగ్‌కు జోగి రమేష్ నివాళి



ఇబ్రహీంపట్నంలో మన్‌మోహన్‌సింగ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న జోగి రమేష్, పార్టీ నాయకులు

ఇబ్రహీంపట్నం: భారతదేశ మాజీ ప్రధానమంత్రి, ఆర్థికవేత్త మన్‌మోహన్‌సింగ్ మృతి బాధాకరమని మాజీ మంత్రి, మైలవరం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. తన నివాసంలో శుక్రవారం వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలసి మన్‌మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలు స్మరించుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ గరికపాటి శ్రీదేవి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వేములకొండ తిరుపతిరావు, సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాహెద్, జిల్లా కార్యదర్శి మిక్కిలి శరభయ్య, నాయకులు పోరంకి శ్రీనివాసరాజు, నల్లమోతు ప్రకాశ్, దయాకర్, జి.రాణి తదితరులు పాల్గొన్నారు.

మైలవరం: మైలవరంలోని బోసు బొమ్మసెంటర్‌లో శుక్రవారం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి స్థానిక కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బొర్ర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు: భారతదేశ అభ్యున్నతికి ఆర్థిక సంస్కరణలే మార్గమని నమ్మిన భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటని తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అన్నారు. తిరువూరు శాంతినగర్‌లో శుక్రవారం మన్మోహన్ సింగ్ మృతికి సంతాప సూచకంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు రేగళ్ళ మోహన్‌రెడ్డి, నరెడ్ల వీరారెడ్డి, చలమాల సత్యనారాయణ, చావా వెంకటేశ్వరరావు, ఓలేటి దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యులు లోకేశ్వరరెడ్డి, శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి ఆ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు పల్లెపాటి శ్రీనివాసరావు, జీవన్‌బాబు తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

టెక్నాలజీతో ప్రజలకు ఎంతో సేవ చేయవచ్చు



మైలవరం: టెక్నాలజీని ఉపయోగించి ప్రజలకు ఎంతో సేవ చేయవచ్చని విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ క్రైమ్, డ్రగ్స్ వినియోగంపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మైలవరం డివిజన్ ఏసీపీ వై.ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఐపీఎస్ మనీషారెడ్డి, టాస్క్ ఫోర్స్ డీసీపీ శ్రీనివాసరావు, మైలవరం సీఐ డి.చంద్రశేఖర్, ఎల్బీఆర్‌సీఈ అధ్యక్షుడు జి.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.

ఇటుక బట్టీలు తొలగించాలని ఆందోళన

మైలవరం: రెడ్డిగూడెం మండలం పాతనాగులూరు గ్రామంలో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన ఇటుక బట్టీలు తొలగించాలని శుక్రవారం నాగులూరు గ్రామం వద్ద విజయవాడ-విస్సన్నపేట ఆర్ అండ్ బీ రహదారిపై గ్రామస్తులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పీవీ ఆంజనేయులు మాట్లాడుతూ గత మూడేళ్లుగా గ్రామానికి ఆనుకుని ఇటుక బట్టీలు ఏర్పాటు చేయడం వలన ఇటుక తయారీకి ఉపయోగించే వరి పొట్టు, ఫ్లై యాష్, బుసక, పొగ, దుమ్ము ప్రజలు తినే ఆహార పదార్థాలు, తాగునీటిలో కలిసి ఇక్కడి ప్రజలు శ్వాసకోశ సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నారని తెలిపారు. ఇటుక బట్టీలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



కేతనకొండ(ఇబ్రహీంపట్నం): గ్రామాల్లో రైతుల భూసమస్యలను పరిష్కరించుకోవడానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు సబ్ కలెక్టర్ కె.చైతన్య తెలిపారు. మండలంలోని కేతనకొండ గ్రామంలో శుక్రవారం జరుగుతున్న రెవెన్యూ సదస్సును ఆయన పరిశీలించారు. గ్రామంలో రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి వచ్చిన 29 అర్జీలు స్వీకరించారు. సత్వర పరిష్కారం చూపాలని ఆదేశించారు. తొలుత రీసర్వేపై గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో సబ్ కలెక్టర్ చైతన్య, తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన ఉండాలి

విస్సన్నపేట: మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై ప్రతి మహిళకు అవగాహన ఉండాలని తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.మోతీలాల్ అన్నారు. విస్సన్నపేట వెలుగు కార్యాలయంలో జాతీయ మహిళా కమిషన్, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, తిరువూరు బార్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో తిరువూరు బార్ అసోసియేషన్ చైర్మన్ వాకదాని లక్ష్మీనారాయణ, ఏపీపీ షేక్ బడేమియా, ఏజీపీ రాము, పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

● కాలువ మరమ్మతు పనులు వేగిరం చేయాలి

చాట్రాయి: తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు మేజర్-1 కాలువ మరమ్మతు పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆయకట్టు రైతులు విజ్ఞప్తిచేశారు. మండలంలోని తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టుకు జైకా నిధులు రూ.15 కోట్లతో చేపట్టే పనులపై శుక్రవారం ప్రాజెక్టు ఆయకట్టు కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో యడవల్లి యర్రంపల్లి మేజర్-1 కాలువ మరమ్మతులు వారం లోగా పూర్తి చేయాలని కమిటీ డైరెక్టర్ చెలికాని కృష్ణారావు కోరారు. కార్యక్రమంలో తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు నీటి సంఘం అధ్యక్షుడు యర్రా రమేష్, ఉపాధ్యక్షుడు జి.వెంకన్న, మరిడి చిట్టిబాబు, ప్రాజెక్టు డీఈ సీతారామరాజు, ఏఈ పరమానందం పాల్గొన్నారు.

● పంట నమోదు తప్పనిసరి

చాట్రాయి: మొక్కజొన్న రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి బి.శివ శంకర్ తెలిపారు. మండల కేంద్రమైన చాట్రాయిలో శుక్రవారం ఈ- పంట నమోదును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట నమోదు చేయడం వల్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రభుత్వం బీమా, మద్దతు ధర చెల్లింపు, పంట నష్ట పరిహారం చెల్లించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు.

● భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

గంపలగూడెం: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం శ్రీరామదీక్షా పరులు నగర సంకీర్తన జరిపారు. దీపోత్సవం కనులవిందుగా నిర్వహించారు. స్థానిక భజనమందిరంలో గోదాదేవి అమ్మవారికి సారె సమర్పించారు. వివిధ రకాల పూలతో గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీ సహస్ర నామార్చన చేశారు.

● బెల్లపు ఊట ధ్వంసం

తిరువూరు: ఎ.కొండూరు మండలం గొల్లమందల తండాలో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి 1050 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ జె.శ్రీనివాస్ తెలిపారు. గంపలగూడెం మండలం అమ్మిరెడ్డిగూడెంలో 2 లీటర్ల కాపుసారాతో పట్టుబడిన గుండ్ల కిశోర్‌ను అరెస్టు చేశామన్నారు.

● రెండు గ్రామాల్లో సమగ్ర భూ రీసర్వే ప్రారంభం

గంపలగూడెం: మండలంలో సమగ్ర భూసర్వేను శుక్రవారం నుంచి పునఃప్రారంభిస్తున్నట్లు తహసీల్దార్ రాజకుమారి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం మండలంలోని ఉమ్మడదేవరపల్లి, దుందిరాలపాడు గ్రామాల్లో సర్వే ప్రారంభిస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

● నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

తిరువూరు: విశ్వబ్రాహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండరును శుక్రవారం తిరువూరులో ఆవిష్కరించారు. దారా టౌన్ షిప్‌లోని విశ్వబ్రాహ్మణ సేవాసంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు చామర్తి రాంబాబు, పమ్మి బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

● భూసమస్యల పరిష్కారానికే సదస్సులు

గంపలగూడెం: భూసమస్యలు, వివాదాలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాజకుమారి తెలిపారు. గంపలగూడెం సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలు సమస్యలను పరిష్కరించాలంటూ ప్రజలు దరఖాస్తులు అందజేశారు.

● శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ



తిరువూరు: హైదరాబాదులోని ఆదర్శ కళానిలయం ఇటీవల నిర్వహించిన శాస్త్రీయ నృత్య నీరాజనం కార్యక్రమంలో తిరువూరు నాగార్జున స్కూలు విద్యార్థినులు ప్రథమస్థానంలో నిలిచారు. సీనియర్ల విభాగంలో నాళా లక్ష్మీ నాగసాయి ప్రణతి, జూనియర్ల విభాగంలో నాగ వెంకట తోయజాక్షి ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు తెలిపారు.

● మామిడిలో చీడపీడల నివారణకు చర్యలు

మైలవరం: మామిడిలో చీడపీడల నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని మైలవరం ఇన్‌చార్జి ఉద్యాన అధికారి సోహైల్ అహ్మద్ తెలిపారు. మైలవరంలోని మామిడి తోటలను రైతులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. చేపట్టవలసిన సస్య రక్షణ చర్యల గురించి వివరించారు.

● కారును ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): 65వ నంబర్ జాతీయ రహదారిపై కిలేశపురం వద్ద ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు శుక్రవారం కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. సేకరించిన వివరాల మేరకు హైదరాబాద్ వైపు నుంచి రెండు కార్లు విజయవాడ వైపు దూసుకొచ్చాయి. తెల్లరంగు గల కారు రెడ్ కలర్ గల కారును ఎడమ వైపు నుంచి క్రాస్ చేయడంతో కంగారు పడిన రెడ్ కలర్ కారు డ్రైవర్ కుడిపక్కన డివైడర్ వైపు పోనిచ్చాడు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన ప్రైవేట్ బస్సు బ్రేకు వేసినప్పటికీ అదుపుకాక కారును స్వల్పంగా ఢీకొట్టింది. బస్ డ్రైవర్ అప్రమత్తంగా లేకపోయి ఉంటే పెద్ద ప్రమాదం జరిగేది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

● చికిత్స పొందుతున్న యువకుడి మృతి

ముసునూరు: కడుపు నొప్పి తాళలేక పురుగు మందు తాగి, ఆసుపత్రి పాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి శుక్రవారం తెలిపారు. మండలంలోని చెక్కపల్లికి చెందిన మానికల వంశీ (21) బుధవారం తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో బాధ భరించలేక పురుగుల మందు తాగాడు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగిస్తామని ఎస్ఐ తెలిపారు.

● ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

తిరువూరు: ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి శుక్రవారం మృతిచెందాడు. సెక్టార్-1 ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల జిల్లా కొల్లూరు మండలం దోనేపూడికి చెందిన తోమాటి లక్ష్మీనారాయణ(30) గురువారం తిరువూరులోని సమీప బంధువు రాఘవేంద్రరావు ఇంటికి వచ్చాడు. ఆర్థిక సమస్యల నేపథ్యంలో అక్కడ లక్ష్మీనారాయణ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స నిమిత్తం విజయవాడ తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మరణించినట్లు ఎస్ఐ తెలిపారు.

● పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

ఆగిరిపల్లి: కూటమి ప్రభుత్వం ఇటీవల భారీగా పెంచిన విద్యుత్ చార్జీలు, ట్రూ అప్ చార్జీలు వెంటనే తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి శివనాగరాజు డిమాండ్ చేశారు. మండలంలోని ఈదులగూడెంలో సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం విద్యుత్ బిల్లులు దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.

● ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతి

ముసునూరు: వేల్పుచర్ల హైస్కూల్లో గతేడాది పదవ తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు డి.షణ్ముఖ వెంకట సాయికి రూ.2,500, పి.నాగరాజుకు రూ.2,000, పి.షణ్ముఖ ప్రియకు రూ.1,500 నగదు బహుమతులను శుక్రవారం ఉపాధ్యాయుడు కేవీ నారాయణరావు, దుర్గారాణి దంపతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● ఆర్థిక సహాయం అందజేత

మైలవరం: రెడ్డిగూడెం మండలం పాత నాగులూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన మిక్కిలి జోజమ్మ కుటుంబాన్ని గ్రామ సర్పంచ్ కొలుసు చిన్ని శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

● మాదిగ ఉప కులాలకు సమన్యాయం చేయండి

ముసునూరు: మాదిగ ఉప కులాలకు చెందిన వారికి విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో సమన్యాయం జరిగేలా సత్వర చర్యలు చేపట్టాలని జిల్లా మాదిగ ఉద్యోగుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి తొమ్మండ్రు యువరాజు కోరారు. ఏలూరు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ఎస్సీ వర్గీకరణపై నియమించిన ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రాను శుక్రవారం సంఘ సభ్యులతో కలిసి వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు.

● రెవెన్యూ సదస్సులో 50 అర్జీలు

ఆగిరిపల్లి: మండలంలోని కనసానపల్లిలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో రైతుల నుంచి 50 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో సర్పంచ్ అమ్మిశెట్టి రమణ, రీ సర్వే డీటీ మరియన్న, ఆర్ఐ యూనస్ పాల్గొన్నారు.

కోస్టల్ బ్యాంక్ సేవల్ని వినియోగించుకోండి

గంపలగూడెం: కోస్టల్ బ్యాంక్ ద్వారా అందజేస్తున్న రుణాలను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని, ఎలాంటి ఇన్‌కంట్యాక్స్ ఫారంలు లేకుండా గృహ నిర్మాణానికి రూ.25లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తామని బ్యాంక్ మేనేజర్ జె.నరసింహారావు తెలిపారు. కోస్టల్ బ్యాంక్ రజతోత్సవాల సందర్భంగా స్థానిక బ్యాంక్‌లో శుక్రవారం ఖాతాదారుల సమక్షంలో కేక్ కట్ చేశారు. తమ బ్యాంకులో సాయంత్రం ఆరు గంటల వరకు బంగారు నగల తాకట్టు రుణాలను పంపిణీ చేస్తామని చెప్పారు. అనంతరం బ్యాంక్ ఆవరణలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో డాక్టర్ మురళి 98 మందికి వైద్య పరీక్షలు చేశారు.

మిర్చి పంట పరిశీలన

ముసునూరు: మిర్చి పంటను ఆశించే తెగుళ్ల నివారణకు తక్షణ సస్య రక్షణ చర్యలు తీసుకోవాలని ఉద్యాన శాఖాధికారి జ్యోతి ప్రియాంక సూచించారు. మండలంలోని గుళ్లపూడి, వలసపల్లిలో సాగవుతున్న మిర్చి పంటలను సిబ్బందితో కలిసి శుక్రవారం ఆమె పరిశీలించారు. తెగుళ్ల ఆశించకుండా ముందస్తుగా సరైన సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

పాస్‌పోర్ట్ పోయినది

దామెర శేషాచలపతిరావు S/o. దామెర వెంకట రంగారావు, చిత్తపూరు, చాట్రాయి మండలం, ఏలూరు జిల్లా వారికి చెందిన ఒరిజినల్ ఇండియన్ పాస్‌పోర్ట్ నెంబర్ G 6840989 (జారీ చేసిన తేది 28-09-2008, వాలిడిటీ తేది 25 08 2018, జారీ చేసిన ప్రదేశం: విశాఖపట్నం) జిరాక్స్ కాపీల సమేతంగా చాట్రాయి వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పోయినది. దొరికిన వారు పై అడ్రస్సును సంప్రదించి అందజేయగలరు.